పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- పారిశుద్ధ్య పనుల పరిశీలన
- పాఠశాలలు, పీహెచ్‌సీని తనిఖీ చేసిన అధికారులు

ఉప్పల్‌వాయిలో మురికి కాలువను పరిశీలిస్తున్న డీఆర్డీవో సురేందర్

నస్రుల్లాబాద్, ఆగస్టు 20 : బీర్కూర్ మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల, కస్తూర్బా, బీసీ బాలుర వసతి గృహాన్ని మండల ప్రత్యేకాధికారి, గనుల శాఖ ఏడీ నరేశ్ మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో ఉపయోగించే నిత్యావసర వస్తువుల తయారి తేదీ, ఎక్స్‌పైరీ డేట్‌ను పరిశీలించారు. వంటశాల, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, తాజా కూరగాయలతో వంట చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో భారతి, ఎంపీవో మహబూబ్, కేజీవీబీ ప్రత్యేకాధికారిణి గీత తదితరులు ఉన్నారు. నస్రుల్లాబాద్‌లోని గిరిజన గురుకుల పాఠశాలను మండల ప్రత్యేకాధికారి దయానంద్ మంగళవారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాల రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో సూర్యకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ మాధవరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

భిక్కనూరు, ఆగస్టు 20 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి రజిత అన్నారు. భిక్కనూరు మండల పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిలోకి వెళ్లి వంటలు, కూరగాయలు, పరిసరాలను పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, లేకుంటే వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు సూచించారు. అనంతరం లైబ్రెరీని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట ఎంపీడీవో రాజ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

రామారెడ్డి మండలంలో డీఆర్డీవో సుడిగాలి పర్యటన

రామారెడ్డి, ఆగస్టు 20: మండల కేంద్రతోపాటు పలు గ్రామాల్లో డీఆర్డీవో సురేందర్ మంగళవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. ముందుగా రామారెడ్డిలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బందితో కలిసి మొక్కను నాటారు. పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న సేవలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలను డాక్టర్ సురేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇసన్నపల్లిలోని పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఉప్పల్‌వాయి ఎస్సీ వసతి గృహంలో మొక్కను నాటారు. గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి స్వర్ణలతకు పలు సూచనలు చేశారు. ఆయనవెంట మండల ప్రత్యేకాధికారి డాక్టర్ రాజేశ్వర్, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, టీఏలు జగదీశ్, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న ఈడబ్ల్యూఐడీసీ జిల్లా డీఈ సాయన్న

నస్రుల్లాబాద్, ఆగస్టు 20 : మండల కేంద్రంలో రూ.2.90 కోట్లతో నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ పాఠశాల, జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను ఈడబ్ల్యూఐడీసీ జిల్లా డీఈ సాయన్న మంగళవారం పరిశీలించారు. త్వరగా భవన నిర్మాణ పనులను పూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట ఏఈ నాగేశ్వర్ రావు, పాఠశాల ప్రత్యేకాధికారిణి గీత ఉన్నారు.

రాజంపేటలో రైతునేస్తం

రాజంపేట్, ఆగస్టు 20 : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారిణి సునీతరాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యంగా వరి పంటలో అక్కడక్కడ మొగి పురుగును గమనించినట్లు తెలిపారు. దీని నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. మక్కజొన్న పంటలో ఆకులు ముదురు నీలిరంగులోకి మారి వాడిపోవడం గమనిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయ విస్తరణాధికారులు శిల్ప, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేపట్టాలి

రాజంపేట్, ఆగస్టు 20 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ అనిల్‌కుమార్ బూత్‌స్థాయి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 28వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. మృతి చెందిన వారిని, ఎక్కువసార్లు పేర్లు నమోదైన ఓటర్లను తొలగించాలన్నారు. తప్పులను సరి చేయడం, దివ్యాంగులు, వృద్ధులను గుర్తించి లిస్టు సిద్ధం చేయాలని బూత్ స్థాయి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సంతోషి, గిర్దవార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

రాజంపేట్, ఆగస్టు 20 : రాజంపేట మండలం గుడితండా గ్రామ పంచాయతీ పరిధిలోని సాలెపల్లి తండాకు చెందిన లకావత్ మల్లేశ్(27) సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భార్యా భర్తల మధ్య కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించి కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గాంధారి ప్రభుత్వ దవాఖానలో చోరీ

- కంప్యూటర్, యూపీఎస్‌లు, బైక్ అపహరణ

గాంధారి, ఆగస్టు 20: గాంధారి ప్రభుత్వ దవాఖానలో సోమవారం రాత్రి చోరీ జరిగిందని ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి దవాఖానలోని ఆరోగ్య మిత్ర గదిలోకి చొరబడి ఒక కంప్యూటర్, రెండు యూపీఎస్‌లను చోరీ చేశాడన్నారు. దవాఖాన ఆవరణలో పార్కింగ్ చేసిన 108అంబులెన్స్ సిబ్బంది బైక్‌ను సైతం ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. దవాఖాన వైద్యుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నామని తెలిపారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

బాన్సువాడ/కామారెడ్డి/గాంధారి, ఆగస్టు 20 : బాన్సువాడలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం నిర్వహించారు. పోలీస్ లైన్‌లో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తాలో రాజీవ్ గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధారిలో రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

మాచారెడ్డి ఏవో బదిలీ

మాచారెడ్డి, ఆగస్టు 20 : మాచారెడ్డి మండల వ్యవసాయశాఖ అధికారిణి రమ్యశ్రీ బదిలీపై నిజామాబాద్ జిల్లాకు వెళ్లారు. మూడు సంవత్సరాల నుంచి ఏవోగా మాచారెడ్డిలో విధులు నిర్వహించారు. బదిలీపై వెళ్లాగా ఆమె స్థానంలో ఇంకా ఏవోగా ఎవరిని నియమించలేదు.

నలుగురు ఏఈవోల నియామకం

భిక్కనూరు, ఆగస్టు 20 : భిక్కనూరు మండలంలోని పలు క్లస్టర్లకు నలుగురు ఏఈవోలు బదిలీపై వచ్చినట్లు మండల వ్యవసాయశాఖ అధికారిణి రాధారెడ్డి తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఏఈవోలు ఇతర మండలాలకు బదిలీపై వెళ్లారన్నారు. బస్వాపూర్ క్లస్టర్ ఏఈవోగా ప్రియాంక, జంగంపల్లి క్లస్టర్ ఏఈవోగా లిఖిత పెద్దమల్లారెడ్డి ఏఈవో లత, రామేశ్వర్‌పల్లి క్లస్టర్ ఏఈవోగా మౌనిక బదిలీపై వచ్చినట్లు చెప్పారు.

అజ్ఞాత వ్యక్తులు ఫోన్‌చేస్తే స్పందించ వద్దు..

బాన్సువాడ, ఆగస్టు 20 : అజ్ఞాత వ్యక్తుల నుంచి మీకు డ్రగ్స్ పార్సల్ వచ్చాయని, డ్రగ్స్ వాడుతూ మీ కుటుంబ సభ్యులు పట్టుబడ్డారంటూ ఫోన్లు వస్తే స్పందించ వద్దని, తక్షణమే స్థానిక పోలీసులు, టోల్ ఫ్రీ నంబర్ 1930కు సంప్రదించాలని బాన్సువాడ పట్టణ ఎస్‌హెచ్‌వో కృష్ణ సూచించారు. బాన్సువాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో సైబర్ మోసాలకు ఎంతో మంది అమాయకులు బలవుతున్నారని తెలిపారు. దీంతోపాటు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఇంట్లోనే ఉండి ఉద్యోగం చేసుకొని లక్షలు సంపాదించుకోవచ్చని, షేర్ మార్కెట్లో పెట్టుబడి పెడితే అతితక్కువ కాలంలో ఎక్కువ లాభాలు వస్తాయంటూ వచ్చే మోసపూరిత ఫోన్‌కాల్స్‌కు ప్రజలు స్పందించవద్దని సూచించారు.

అదనపు భవనం ప్రారంభం

నస్రుల్లాబాద్, ఆగస్టు 20 : నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.22 లక్షలతో నూతనంగా నిర్మించిన సొసైటీ అదనపు భవనాన్ని విండో చైర్మన్ దివిటి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక గ్రేడ్లు సాధించిన విద్యార్థులకు సహకార సంఘం తరపున బహుమతులను అందజేశారు. సొసైటీ పరిధిలో 77 మంది రైతులకు రూ.33 లక్షల కొత్త రుణాలను అందజేశారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ అరుణ్‌నాయక్, బ్యాంక్ మేనేజర్ సందీప్, డైరెక్టర్లు సరిచంద్, గంగారాం, మొగులవ్వ, రైతులు ఉన్నారు.

జిల్లా కేంద్రంలో భారీ వర్షం

కామారెడ్డి, ఆగస్టు 20 : జిల్లా కేంద్రంలో మంగళవారం జోరుగా వర్షం కురిసింది. కామారెడ్డిలో పలు రోడ్లన్నీ చెరువులను తలపించాయి. నిజాంసాగర్ రోడ్, పాత బస్టాండ్‌లో ఉన్న దుకాణాల వద్ద నీరు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొత్త బస్టాండ్ లోపలికి వెళ్లేటప్పుడు నీరు చేరడంతో ప్రయాణికులు, వాహనాలుకు తీవ్ర అవస్థలు పడ్డారు. భిక్కనూర్‌లో 61.8 మి.మీ, తాడ్వాయిలో 36.3 మి.మీ, మద్నూర్‌లో 35 మి.మీ, నస్రుల్లాబాద్‌లో 33 మి.మీ, మాచారెడ్డిలో 27.8, బీర్కూర్‌లో 25.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

మొక్కల పంపిణీ

కాలనీ వాసులకు మొక్కలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ స్వప్న

కామారెడ్డి, ఆగస్టు 20 : జిల్లా కేంద్రంలోని 47వ వార్డులో కౌన్సిలర్ గెరిగంటి స్వప్న కాలనీ వాసులకు మంగళవారం మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటికి ఒక్క మొక్కను నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు గెరిగంటి లక్ష్మీనారాయణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి రామకృష్ణ

కామారెడ్డి, ఆగస్టు 20 : ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా నామ్‌కే వాస్తే రెండు పథకాలు అమలు చేసి మిగతా హామీలను గాలికి వదిలేశారని అన్నారు. ప్రజలు రేషన్ కార్డులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వారిని పట్టించుకున్న పాపానపోలేదని అన్నారు. ఇండ్లు లేని వారికి స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ఈ నెల 22న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రం నుంచి ప్రదర్శన, ఇందిరా పార్క్‌లో ధర్నా కార్యక్రమం ఉంటుందని, దీనిని విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు ప్రకాశ్, సురేశ్, కిశోర్, నారాయణ, రమేశ్, మహిళా సంఘ నాయకులు అనిత తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

భిక్కనూరు, ఆగస్టు 20 : పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మండలంలోని రామేశ్వర్‌పల్లికి చెందిన చేపూరి స్వామి, తిప్పాపూర్‌కు చెందిన కిషన్ సెల్ ఫోన్లు పోగొట్టుకోగా వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనుల పరిశీలన

రామారెడ్డి బాలికల పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న పీఆర్‌డీఈ షాలిని

పనులు తిరిగి చేపట్టాలని కాంట్రాక్టర్‌కు పీఆర్ డీఈ ఆదేశం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

రామారెడ్డి, ఆగస్టు 20: రామారెడ్డిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను పీఆర్ డీఈ షాలిని మంగళవారం సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తిరిగి చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పాఠశాలలో చేపట్టిన పనులు నాసిరకంగా ఉన్నాయని, పాత పనులకు పూత పెట్టి బిల్లులు కాజేశారని 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 17వ తేదీన కథనం ప్రచురితమైంది. ఆ రోజు పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి హాజరైన డీఈవో రాజు, ఎంఈవో యోసెఫ్‌కు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు చేశారు. రూ.లక్షా60వేలు ప్రభుత్వం మంజూరు చేయగా.. పనులు సక్రమంగా చేపట్టలేదని అధికారులకు వివరించారు. దీంతో పీఆర్ డీఈ షాలిని, ఎంఈవో యోసెఫ్, పీఆర్ ఏఈ సంతోష్ సంబంధిత కాంట్రాక్టర్‌తో కలిసి మంగళవారం పాఠశాలను సందర్శించి, పనులను పరిశీలించారు. పనులను మరోసారి చేపట్టాలని, లేదంటే చర్యలు తప్పవని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. వారివెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు ఎస్ఎంసీ మాజీ చైర్మన్ ఉసికె రాజేందర్, బండకింది రమేశ్, నామాల గంగాధర్, గోపి, దేవీదాస్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

గాంధారి, ఆగస్టు 20: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీపై రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని బీజేపీ గాంధారి మండలాధ్యక్షుడు మధుసూదన్‌రావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్పష్టమైన హామీ ఇవ్వకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు కాట్రోత్ రవి, సాయిబాబా, కటికె హుస్సేన్, రాథోడ్ నెహ్రూ, నవీన్, గండి రమేశ్, సాయాగౌడ్, శ్రీనివాస్, రాజేందర్, భాస్కర్‌రావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం మంజూరుపై హర్షం

గాంధారి, ఆగస్టు 20: గాంధారిలో మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ తెలుపడంతో యువకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మినీ స్టేడియం ఏర్పాటుకు కృషిచేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గాంధారిలో ఎమ్మెల్యే చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట ఏవోగా హరివెంకటప్రసాద్

నాగిరెడ్డిపేట, ఆగస్టు 20: మండల వ్యవసాయ శాఖ అధికారి(ఏవో)గా హరివెంకటప్రసాద్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. నాగిరెడ్డిపేట ఏవోగా పని చేసిన విజయశేఖర్ బదిలీపై టెక్నికల్ ఏవోగా నిజామాబాద్ డీఏవో కార్యాయానికి వెళ్లారు. ఆయన స్థానంలో మాల్తుమ్మెద విత్తనక్షేత్రంలో ఏవోగా పని చేస్తున్న హరివెంకటప్రసాద్‌ను నాగిరెడ్డిపేట ఏవోగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాతూ.. రైతులకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తానని తెలిపారు.

మాల్తుమ్మెద లైన్ ఇన్‌స్పెక్టర్‌గా నూరియా

ప్రమోషన్ ఉత్తర్వులను అందుకుంటున్న నూరియా

మాల్తుమ్మెద, ఆగస్టు 20: మండలంలోని మాల్తుమ్మెద సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా నూరియా మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఎల్లారెడ్డి మండలంలో లైన్‌మన్‌గా పనిచేసిన ఆయన ప్రమోషన్‌పై మాల్తుమ్మెదకు వచ్చారని ఏఈ మనోరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ చంద్రకాంత్, యూనియన్ నాయకులు మోతీరాం, సురేందర్, బీర్మల్, అమ్రియా తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రామారెడ్డి/గాంధారి, ఆగస్టు 20: రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామారెడ్డి ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారి సురేశ్ ఆధ్వర్యంలో 63మంది విద్యార్థులను పరీక్షించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివరాం బాబు, వైద్య సిబ్బంది జార్జ్, జానకమ్మ, చంద్రకళ, మహేశ్వరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈఎంఆర్ఎస్‌లో నేత్ర వైద్య శిబిరం..

గాంధారిలోని ఏకలవ్య మోడల్ పాఠశాల(ఈఎంఆర్ఎస్)లో మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య సహాయ అధికారి హరికృష్ణ 214 మంది విద్యార్థులను పరీక్షించి.. 11 మందికి కంటి సమస్యలు, 18 మందికి పాక్షికంగా దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలకు రిఫర్ చేసినట్లు డాక్టర్ హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సాయికుమార్, ఇష్యాంత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో బీటెక్ విద్యార్థి మృతి

లింగంపేట, ఆగస్టు 20: మండలంలోని బాయంపల్లి తండాకు చెందిన చౌహాన్ పీరేందర్ (21) జ్వరంతో బాధపడుతూ మృతి చెందినట్లు తండా వాసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పీరేందర్ ఖమ్మం పట్టణంలో బీటెక్ చదువుతున్నాడు. ధ్రువపత్రాలు తీసుకెళ్లడానికి ఆదివారం తండాకు వచ్చాడు. తీవ్రంగా జ్వరం రావడంతో లింగంపేటలోని ఓ ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స పొందాడు. జ్వరం తగ్గకపోవడంతో సోమవారం రాత్రి అతడి వద్దకు తీసుకువచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కామారెడ్డికి తీసుకెళ్లాలని సూచించాడు. కామారెడ్డిలో కూడా వైద్యులు హైదరాబాద్‌కు తరలించాలని తెలిపారు. దీంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందాడన్నారు. ప్రైవేటు వైద్యుడి నిర్లక్ష్యంతోనే పీరేందర్ మృతిచెందాడని తండావాసులు ఆరోపిస్తున్నారు. కాగా.. అతడికి డెంగీ సోకిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నిజాంసాగర్‌లో తమిళనాడు ఇరిగేషన్ అధికారులు

రైతులతో సమావేశం నిర్వహిస్తున్న తమిళనాడు నీటిపారుదల శాఖ అధికారులు

నిజాంసాగర్, ఆగస్టు 20: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన నీటి వినియోగదారుల సంఘం సభ్యులతో తమిళనాడు ఇరిగేషన్ అధికారులు మంగళవారం సమీక్షను నిర్వహించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో వారు పలు వివరాలను సేకరించారు. గతంలో నీటి వినియోగదారుల సంఘా లు పనిచేసిన తీరును సంఘ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమిళనాడు నీటి పారుదల శాఖ అధికారులు మాట్లాడుతూ.. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో వివరాలను సేకరించి తమ రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ జనరల్ చీఫ్ ఇంజినీర్ రాజు, కో-ఆర్డినేటర్ జగన్, పీఐఎం స్పెషలిస్టు నాగరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మంగయార్కరసి, సుబ్బరాజు, కార్తికేయన్, ఏడీఏ కె.సునీత, అన్నపూర్ణ, ఇరిగేషన్ ఈఈ సోలోమన్, ఏఈ శివప్రసాద్, తమిళనాడు నీటి పారుదల శాఖ అధికారుల బృందం, రైతులు వెంకట్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, గజ్జల కిరణ్, చిట్యాల రామకృష్ణ, గుమాస్తా శ్రీనివాస్, బంగ్ల ప్రవీణ్, ఖాజా పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

లింగంపేట, ఆగస్టు 20: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న పద్మ పీఆర్టీయూ టీఎస్ జిల్లా మహిళా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. దీంతో పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. శాలువా కప్పి సత్కరించారు.

ఐలాపూర్ పాఠశాలలో రక్షాబంధన్

రాఖీలను కట్టుకుంటున్న విద్యార్థులు

లింగంపేట, ఆగస్టు 20: మండలంలోని ఐలాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రక్షాబంధన్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం దామోదర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సోదర భావాన్ని పెంపొందించడానికి రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. 'నేను నీకు రక్షా.. నీవు నాకు రక్షా.. మనమిద్దరం దేశానికి రక్షా..' అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, శివానంద్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లింగంపేట, ఆగస్టు 20: మండల కేంద్రంలో తన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు బాధితుడు సాయాగౌడ్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుస్వామి స్క్రాప్ దుకాణం వద్ద సోమవారం పార్కింగ్ చేసిన వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325792
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కాంగ్రెస్ పార్టీ నుంచి ఏఎంసీ మాజీ చైర్మన్ సస్పెన్షన్

మద్నూర్, ఆగస్టు 20: మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం మద్నూర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్ల